# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# అమ్మ బాధ (భాష)

"శ్రీకారం చుట్టుకుంది పెళ్ళి పుస్తకం, ఇక ఆకారం దాల్చుతుంది కొత్త జీవితం" సన్నాయి వాయిద్యంతో హైదరాబాదులోని ప్రముఖ కల్యాణ మండపాలలో ఒకటైన "నోమా ఫంక్షన్ హాల్" మారుమోగుతోంది.

" ఎంత తెలుగుదనం, ఎంత మంచి పాట, అందుకే దాదాపు పాతికేళ్ళవుతున్నా ఇలాంటి పాటలు ఇంకా అందరినోళ్ళల్లో నానుతున్నాయి "అనుకుంది తరంగిణి. ఆమె చెల్లెలు సౌదామిని కూతురు శ్రీనిజ పెళ్ళి జరుగుతోంది. ప్రముఖ డిజైనర్ తో ప్రత్యేకంగా చేయించుకున్న పెళ్ళి చీరలో బంగారు బొమ్మలా మెరిసిపోతోంది శ్రీనిజ.

"పిడికిట తలంబ్రాల పెళ్ళికూతురు" వాయిస్తున్నారు, ఇద్దరూ ఆనందంగా ఒకరిపై ఒకరు తెల్లని మల్లెపూలూ, బియ్యం కలిపిన తలంబ్రాలు పోసుకుంటూ, ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్న దృశ్యం ఎంతో అందంగా కనిపించింది తరంగిణికి. పెళ్ళి తనకిష్టమైన వాడితోనే చేసుకుంటున్నా, వేడుకలన్నీ తమ ఇష్టప్రకారమే చేయించుకుంటున్న పిల్లని చూస్తుంటే అక్కచెళ్ళెల్లిద్దరికీ పట్టరాని సంతోషంగా ఉంది.

"పెద్దమ్మా" అంటూ నిన్నటిదాకా తన కొంగు పట్టుకుని తిరిగిన పసిపిల్ల అప్పుడే పెళ్ళికూతురయిపోయిందని అనుకుంటేనే ఆమెకెంతో ఆశ్చర్యంగా ఉంది. "తనకే ఇలా ఉంటే చెల్లెలికెలా ఉందో ? "అనుకుంది.

తరంగిణీ, ఆమె భర్త ప్రభాకర్, పిల్లలు శ్రీకర్, శ్రీహిత్ బెంగుళూరు లో ఉంటారు. చెల్లెలు సౌదామినీ, ఆమె భర్త సుధాకర్, పిల్లలు శ్రీనిజ, శ్రీప్రియ ఢిల్లీ లో ఉంటారు. ఏడాదికి కనీసం రెండు సార్లైనా అక్క ఇంటికి పిల్లలని తీసుకుని వచ్చేది సౌదామిని, అంతే కాక విహారయాత్రలకీ, పుణ్యక్షేత్రాల యాత్రలకీ కూడా దాదాపుగా కలిసే వెళ్ళేవారు, రెం డు కుటుంబాల మధ్యా ఎంతో అనుబంధం.

"పెద్దమ్మా, ముఝే చావల్ మే తొక్కు పచ్చడీ మిలాకే దేనా ప్లీజ్, " అంది సోఫాలో కాళ్ళు చాపుకుని కూర్చున్న పన్నెండేళ్ళ శ్రీనిజ.

"తెలుగులో" అని ఇంకా ఏదో అనబోతున్న తరంగిణి మాటకడ్డు వస్తూ,

"ముఝే ఆవకాయ అన్నం చాహియే, తొక్కుపచ్చడీ నహీ" అంది ఆరేళ్ళ శ్రీహిత.

ఒకేరకమైన గౌన్లు వేసుకుని ముద్దుగా ఉన్న వాళ్ళని చూసి చిరునవ్వుతోనూ, చిరుకోపంతోనూ,

"మీరిద్దరూ ఇలా కాకుండా తెలుగులో అడిగితే చక్కగా కలిపి పెడతాను, లేకపోతే లేదు" అంది.

"హా, పెద్దమ్మా ప్లీజ్, మిలాదో నా" అన్నారు ఇద్దరూ ఒకేసారి. ఆడపిల్లలు లేని తరంగిణి కి వాళ్ళిద్దరంటే తగని ముద్దు, తను ఒక్క మాట అనదు, మరెవ్వరినీ అననివ్వదు.

" సరే అలాగే, "అంది వాళ్ళిద్దరినీ మురిపెంగా చూస్తూ

"హాయ్ మాం, వాట్స్ అప్? ఓ రైస్ అండ్ ఆవకాయ్, ప్లీజ్ గివ్ మీ సం" అన్నాడు అప్పుడే అక్కడకి వచ్చిన కొడుకు శ్రీకర్.

"వీడో పెద్ద లండన్ దొరగారు, నోరిప్పితే ఇంగ్లీష్ తప్ప మరో మాట రాదు" అని విసుక్కుంది.

"మాం, ప్లీజ్ డోంట్ స్టార్ట్ ఎగైన్" అన్నాడు అప్పుడే అన్నతో చేరిన చిన్నవాడు.

" మీరు మారర్రా" అంది నిరాశగా.

ఢిల్లీ లో ఉండే చెల్లెలి పిల్లలు హిందీలో మాట్లాడితే, భారతదేశపు సిలికాన్ వాలీ గా పేరుపొందిన బెంగుళూరులో పెరిగిన తన పిల్లలు ఇంగ్లీష్ లోనే మాట్లాడడం ఆవిడకి నచ్చదు.

నలుగురికీ కూడా తెలుగు అనర్గళంగా మాట్లాడడం నేర్పాలని ఎంతో ప్రయత్నం చేసింది, చేస్తూనే ఉంది ఇప్పటికీ. రాదని కాదు గానీ, ఎదో మొక్కుబడిగా మాట్లాడతారు అందరూ కూడా. అది ఆమెకి చాలా బాధగా ఉంటుంది.

భర్త తో చెప్తే "ప్రతీ చిన్న విషయానికీ అంత బాధపడితే ఎలా తరూ, ప్రస్తుతం రోజులెలా ఉన్నాయి చెప్పు? బయటకి వెళితే వాళ్ళు వినే భాష వేరు, వ్యవహారం వేరు, నువ్వే అర్ధం చేసుకోవాలి" అని తనకే చెప్పడం ఆవిడకింకా విసుగు.

"మీరూ నాకే చెప్తారు, అలా అనుకోవడానికి మనమేమీ విదేశాల్లో లేము " అనేది కోపంగా.

ప్రముఖ సంస్కృతాంధ్ర పండితుడూ, అష్టావధానిగా పేరు పొందిన ప్రముఖుని కూతురిగా, తమ పిల్లలు తెలుగులో మాట్లాడకపోవడం ఆమె ఎంతో అవమానంగా అనిపిస్తుంది కూడా.

తండ్రి రాజమండ్రి దగ్గరలో ఉన్న సంస్కృతపాఠశాల లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసేవారు. ఇంట్లో మడీ, తడీ, ఆచారమూ, సాంప్రదాయమూ రవ్వంత ఎక్కువే. దానివల్లనూ, తండ్రి చిన్ననాటినించీ నేర్పించిన విషయాలవల్లనూ తరంగిణి తనకు తెలియకుండానే కొంత సనాతన భావాలను అలవర్చుకుంది, పూజలూ, వ్రతాల పట్లా మక్కువా ఎక్కువే, ఆవిడ ధోరణి చాదస్తంగా అనిపించడం కూడా కద్దు.

అంతే కాక మొదటినించీ తెలుగు భాష అన్నా, సాహిత్యం అన్నా ఎంతో అభిమానం ఆమెకి. తన కోరిక మేరకు ఎం. ఏ తెలుగు చదువుకుంది, తెలుగు పాటన్నా, మాటన్నా ప్రాణం ఆమెకి. ఎం.ఏ రెండో సంవత్సరంలో ఉండగా ప్రభాకర్ తో పెళ్ళి అయింది ఆమెకి, అతనో ప్రముఖ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్. పెళ్ళి అయిన సంవత్సరానికే భర్త ప్రాజెక్ట్ నిమిత్తం అమెరికా వెళ్ళవలసి వచ్చినప్పుడు దాదాపు ఏడ్చినంత పనిచేసింది ఆమె.

"బెంగుళూరులో ఉంటేనే నాకు ఎక్కడో మరో దేశంలో ఉన్నట్టుంది, మన గోదావరినీ, అమ్మ చేతివంటనీ, మన ఇంటి గడపనీ ఎంతో మిస్ అయిపోతున్నాను, ఇంకా ఆ దేశం కాని దేశంలో నేనుండలేను నాన్నా " అని తండ్రితో గొడవ పెట్టింది.

"తప్పమ్మా, అలా అనకు, జీవితంలో ప్రతీదీ కొత్త అనుభవాన్ని మనస్పూర్తిగా ఆహ్వానించాలి, అప్పుడే అందులోని మాధుర్యాన్ని ఆస్వాదించగలం. తరచి చూస్తే ఇలాంటి అనుభవాలే మనకెన్నో విషయాలు నేర్పుతాయి" అన్నారాయన.

" ఆన్ సైట్ అసైన్మెంట్ ఎప్పుడు వస్తుందా అని అందరూ ఎదురుచూస్తారు తరూ, నువ్వేమిటిలా?" అని నవ్వాడు ప్రభాకర్.

" నిజమేనండీ, కానీ నాకెందుకో అసలా కోరికే లేదు, గోదావరి పావంచాల మీద కేవలం పాదాలు తడిసేలా కూర్చుని ప్రాక్దిశన నెమ్మదిగా ఉదయించే సూర్యభగవానుణ్ణి చూస్తూ, ఆ కిరణాలకి నెమ్మదిగా వేడెక్కుతూ, నాట్యమాడే చిరు అలలని చూస్తూ ఉంటే వచ్చే ఆనందం ఎందుకో మరి నాకెక్కడా కనిపించలేదు ఇప్పటివరకూ" అంది.

"నిజమే తరూ! మనం పుట్టి పెరిగిన ఊరుమీదా, పరిసరాల మీదా మనకా మాత్రం అభిమానం ఉండడం చాలా సహజం, కానీ జీవితం ఎప్పుడూ ఒకచోట ఆగిపోదు కదా, మరిన్ని కొత్త అందాలని చూడటానికే ఈ ప్రయాణం అనుకో" అన్నాడు. అలా వెళ్ళి మూడేళ్ళు ఉన్న అమెరికా జీవితంలో అనుక్షణమూ తన దేశాన్ని మిస్ అవుతూనే ఉంది.

తిరిగి వచ్చాకా, పోయిన ఊపిరి తిరిగి వచ్చినట్టయిందామెకి. అప్పటినించీ బెంగుళూరులో స్థిర పడ్డారు, పిల్లలకి సెలవు ఇచ్చిన వెంటనే పరుగున గోదావరొడ్డున ఉన్న తమ ఇంట్లో వాలిపోవడమూ, గోదావరినీ, కోనసీమ అందాలనీ ఆస్వాదించడమూ అలవాటుగా మారిపోయాయి.

పిల్లలు తన మాట వినే వయసు వరకూ వాళ్ళకి మాయాబజార్, భూకైలాస్ వంటి మంచి సినిమాలు చూపించేది, రామాయణ, మహాభారతాల్లోంచి చిన్న చిన్న కథలు చక్కగా చెప్పేది, "లేకపోతే వాళ్ళకెలా తెలుస్తాయి?" అనేది. ఒకరోజు అంతా కలిసి భూకైలాస్ సినిమా చూస్తూ, "రాముని అవతారం, రవికుల సోముని అవతారం" పాట వస్తూ ఉండగా శ్రీకర్ అడిగాడు,

" రవికుల సోముడు" అంటే ఏమిటి, ఎవరు? అని.

వెంటనే పక్కనే ఉన్న చెల్లెలి కూతురు "నాకు తెలుసు అన్నా, కృష్ణుడు" అంది.

"ఓ ఐసీ, అన్నాడు వాడు.

" రవికుల సోముడంటే కృష్ణుడా? మా అమ్మే, ఎలాగో చెప్పామ్మా? అంది తరంగిణి పదిహేనేళ్ళ ఆ పిల్లతో.

ఆమె వెటకారాన్ని గుర్తించలేని శ్రీనిజ" ఓ పెద్దమ్మా, నువ్వే చెప్పావు కదా, అప్పుడే మర్చిపోయావా? గోపీ జబ్ నహాతే హై తో తబ్ కానా వాళ్ళ రవికెలు అంటే చోలీలు ఉఠాకే లేకే గయా నా. రవికెలు ఎత్తుకెళ్ళాడు కనక రవికుల సోముడు" కరక్టే కదా? అంది గర్వంగా.

పచ్చడి బండ తీసి నెత్తి బాదుకోవాలనిపించింది తరంగిణికి.

" వింటున్నావా, సౌదా? ఇంత గొప్ప వ్యాఖ్యానం ఎవరూ రాయలేదు, రాయలేరు". అంది కోపంగా.

" పోనీలే, వాళ్ళని సినిమా చూడనియ్యి" అన్నాడు ప్రభాకర్.

ఎప్పుడూ పిన్ని కూతురితో గిల్లికజ్జాలు పెట్టుకునే శ్రీకర్ మాత్రం " నాకు తెల్సు అమ్మా, షి కాంట్ గెట్ ఎనీతింగ్ రైట్, నువ్వు చెప్పు అసలు మీనింగ్" అన్నాడు.

అప్పుడు అందరికీ వివరించింది అసలు అర్థాన్ని. " రవికులము అంటే సన్ డైనాస్టీ, రాముడు వాళ్ళు సూర్య వంశానికి చెందిన వారు, అటువంటి వంశంలో పుట్టిన సోముడు అంటే చంద్రుడు. రవికులంలో పుట్టిన చంద్రుని వంటి వాడు రామచంద్రుడు అని ఆ మాటకి అర్థం.

అర్థం అయినా, కాకపోయినా పెద్ద గొప్పగా తలలూపారు నలుగురూ. ఆరోజంతా చెల్లెలిని ఆట పట్టిస్తూనే ఉన్నాడు శ్రీకర్. " ఐసే బోల్ రహా హై కే జైసే ఉస్కో సబ్ మాలూం హై" అని ఏడ్చినంత పని చేసింది శ్రీనిజ. "ఊరుకోరా, చిన్నపిల్ల, దానేమీ అనకు" అని వాడిని కోప్ప డింది.

మరొకసారి చిన్న పిల్లలిద్దరి మధ్యా గొడవ.

"మా, హౌ కెన్ హెడ్ అలోన్ గో టూ ఢిల్లీ?" అని అడిగాడు.

" అదేమిట్రా? తల ఢిల్లీ వెళ్ళడం ఏమిటీ?ఎవరన్నారు అలా?" అంది ఆశ్చర్యంగా.

" ప్రియా సేస్ దట్" అన్నాడు.

పిలిచి అడిగితే " మా నే కహా, నాకు జ్వరం వచ్చినప్పుడు మా కో బహుత్ దర్ లగా, అందుకే తను తల ఢిల్లీ పోయింది అని నాతో చెప్పింది, అదే అన్నతో చెప్పాను" అంది శ్రీప్రియ అమాయకంగా.

నవ్వాలో, ఏడవాలో తెలియలేదు తరంగిణికి.

"అది తలో, కాళ్ళో ఢిల్లీ వెళ్ళడం కాదర్రా, తల్లడిల్లి పోవడం, అంటే చాలా వర్రీ అవడం" అని చెప్పింది సౌదామిని పెద్దగా నవ్వుతూ.

"రాముని తోక" అన్నట్టుంది వీళ్ళ వ్యవహారం" అంది చెల్లెలితో.

ఇలాంటి సంఘటనలెన్నో నిన్న మొన్నా జరిగినట్టే ఉన్నాయి తన మనసుకి. చూస్తూ ఉండగానే పెద్దవాళ్ళయిపోయారు నలుగురూ, తన కొడుకులిద్దరూ ఉద్యోగాల్లోనూ, పెద్ద చదువుల్లోనూ బిజీ అయిపోయారు.

శ్రీనిజ బెంగుళూరులోనే విప్రో సంస్థలో ఉద్యోగంలో చేరింది. " మై పెద్దమ్మా కే పాస్ రహూంగీ" అని సంబరంగా వచ్చేసింది.

పొద్దున్న పోతే రాత్రెప్పుడో రావడాలు, వచ్చినప్పటినించీ సెల్ ఫోన్లలోనూ, నెట్ లోనూ చాటింగ్ లూ, సెలవు వస్తే పదీ, పదకొండు గంటల దాకా నిద్ర పోవడాలూ, ముగ్గురిదీ ఇంచుమించుగా ఒకేవరస.

"చిన్నప్పుడు కాకరకాయ, పెద్దయ్యాకా కీకరకాయ" అన్న చందంగా చిన్నప్పుడు విన్నంత కూడా తన మాట వినని ఆ పిల్లలని చూస్తే చిరాగ్గా ఉన్నా, ఏమీ అనలేక ఊరుకునేది.

ప్రభాకర్ ఎప్పటిలాగే తననే అనునయించడానికి ప్రయత్నించేవాడు.

" మిగతావేమీ చేయకపోయినా పరవాలేదు, కనీసం మన భాషలో మాట్లాడాలి కదా, అదే నా బాధ" అనేది రవ్వంత ఆవేదనతో.

" పోనీలే తరూ, మనం మాత్రం ఏం మాట్లాడుతున్నాం? ఏదో చిన్న పిల్లలు, వాళ్ళే నేర్చుకుంటారు, ఊరికే బలవంతం చేస్తే ప్రయోజనం లేదు కదా, కనీసం నువ్వు తెలుగులో మాట్లాడేది వాళ్ళు అర్థం చేసుకుంటారు కదా" అనేవాడు.

"ఏమి టో అంత పెద్ద పండితుడి మనవలు మళ్ళీ, నాన్నగారి ఆత్మ ఎంత గోషిస్తోందో? ఆయన అదృష్టం, ఇవన్నీ చూడకుండానే వెళ్ళిపోఅయారు. " అని కళ్ళ నీళ్ళు పెట్టుకునేది.

“మాతృభాషంటే అమ్మతో సమానం, అమ్మ భాషలో మాట్లాడని వారు అమ్మనెలా ప్రేమిస్తారు? అంది.

" అలా సంబంధం లేని విషయాలని లింక్ పెట్టి మాట్లాడకు, నెమ్మదిగా వాళ్ళే తెలుసుకుంటారులే, ఎప్పుడో ఒకసారి వాళ్ళకీ అనుభవం అవుతుంది, అప్పుడు మారతారు అందరూ, నువ్వు చూస్తూ ఉండు" అన్నాడు.

“ఏమిటో ఆ రోజొస్తుందా? అనిపిస్తుంది, అయినా సౌదా, మనవాళ్ళే ఇలా ఉన్నారేమో, తమిళవాళ్ళు, మరాఠీ వాలూ, మిగతా రాష్ట్రాల వారందరూ ఇలాగే ఉన్నారా? ” అని గొడవ పెట్టేది.

" మరీ అంత ఇమోషనల్ అవకూడదు లే అక్కా, వాళ్ళ జీవితాలు వాళ్ళవి" అనేది చెల్లెలు కూడా.

“అదికాదే! మొన్న మీ బావగారి స్నేహితుడొకాయన ఏమన్నాడో తెలుసా? "మీరు బాధ పడడం లో అర్థం ఉందండీ, కానీ మనమేమీ చేయలేని పరిస్థితి లా తయారయింది ఇప్పుడు, ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు ఈ మాత్రం బ్రతికి ఉందంటే తెలుగు సినిమాలే కారణం అని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను” అని. అతని మాట ఎంత నిజమో! అనిపిస్తోంది వీళ్ళని చూస్తూ ఉంటే” అంది.

“అలా అయినా చూస్తూ మన భాషతో టచ్ లో ఉన్నారని అనుకోవచ్చు కదా !“ అనేవాడు ప్రభాకర్.

శ్రీనిజ వచ్చి దాదాపు ఆరునెలలవుతోంది. ఓరోజు చెల్లెలి దగ్గరనించి ఫోన్.

"అక్కా నిజ పెళ్ళి విషయం గురించి అనుకుంటున్నాము కదా, మొన్నొకరోజు అడిగితే అటూ ఇటూ ఏమీ చెప్పకుండా దాటేసింది, నాకేదో అనుమానంగా ఉంది, నీతో అయితే చెప్తుంది, ఒకసారి కనుక్కో" అంది కొంత ఆత్రంగా. తరంగిణి గుండెల్లో బాంబు పడినట్టయింది, సాంప్రదాయానికి ప్రాణమిచ్చే ఆమెకి ఇది అస్సలు భరించలేని విషయం.

" ఊరికే అలా బాధపడకు తరూ, పిల్లలు పెరిగారు, అన్నీ తెలుసుకున్నారు, వాళ్ళ అభిప్రాయాలు గౌరవించాలి, ముందు దాన్ని అడిగి విషయం తెలుసుకుందాం, దాని తర్వాత చూద్దాం ఏం చెయ్యాలో" అన్నాడు ప్రభాకర్.

వారందరి అనుమానం నిజమే అయింది, అనునయంగా అడిగితే శ్రీనిజ అసలు విషయం చెప్పింది, తన సహోద్యోగి అయిన శ్రీవత్సన్ అనే తమిళ అబ్బాయిని ఇష్టపడుతున్నట్టూ, అందరి ఆమోదంతోనూ, ఆశీర్వాదంతోనే వారిద్దరూ వివాహం చేసుకోవాలని అనుకుంటున్నట్టూ.

కోపంతో విరుచుకు పడింది తరంగిణి. " అదేం పనే? నేనూ, మీ అమ్మా నీకు చక్కటి సంబంధం చూసి, సాంప్రదాయబద్ధంగా పెళ్ళి చేద్దాం అనుకుంటుంటే ఇలా ఎవరో వేరే రాష్ట్రపు పిల్లవాడిని ప్రేమించడం ఏమిటి? మన వాళ్ళెవరూ దొరకలేదూ? “అంటూ కోప్పడింది.

" ఈ రోజుల్లో ఇవన్నీ సాధారణంగా జరుగుతున్నవే తరంగిణీ! మనం ఆవేశ పడకూడదు, మన అంగీకారం తోనే కదా వాళ్ళు చేసుకుంటామన్నది, మీ అక్క చెళ్ళెల్లిద్దరూ ఇలా డీలా పడిపోతే ఎలా? ముందు నేనూ, సుధాకర్ వెళ్ళి వారిని కలిసి వస్తాము, తర్వాత మీరు కూడా కలిసి మాట్లాడవచ్చు” అంటూ చెప్పాడు.

అయిష్టంగానే ఒప్పుకున్నారు ఇద్దరూ. ఆతర్వాత అన్నీ చక చకా జరిగిపోయి, పెళ్ళి దాకా వచ్చింది.

"ఈడు జోడూ బాగున్నారు, మనవాళ్ళు కాకపోయినా వాళ్ళందరూ చాలా మంచివాళ్ళు, మన అమ్మాయి సుఖంగా ఉంటుందనే నమ్మకం నాకుంది" అనకుండా ఉండలేకపోయింది చెల్లెలితో.

పెళ్ళి జరిగిన వెంటనే అమెరికా వెళ్ళి ఆరునెలల చంటి పిల్లాడితో దాదాపు ఏడాదిన్నర తర్వాత, వచ్చింది శ్రీనిజ పెద్దమ్మ ఇంటికి.

చిన్న పిల్లగా తన కళ్ళముందు తిరిగిన పిల్ల బిడ్డతల్లిగా తన ఇంట అడుగుపెట్టినప్పుడ చిన్నపిల్లలా సంబరపడింది తరంగిణి.

" ఇదిగో నాన్నా, చూడు పెద్దమ్మమ్మ " అని చూపించింది శ్రీనిజ తన కొడుకుకి.

అంతేకాదు, బోసినవ్వులు నవ్వుతున్న వాడితో "పెద్దమ్మమ్మ అంటే తెలుసా, అమ్మ కి పెద్దమ్మ, అమ్మమ్మకి అక్క" అని వివరిస్తున్న శ్రీనిజని ఆశ్చర్యంగా చూసింది.

తనకి తెలిసి ఆ పిల్ల అంత తెలుగు మాట్లాడటం ఇదే మొదటి సారి.

అంతే కాదు "బొబ్బ తాగుతావా?", "ఆమ్మ తింటావా?, " లాల పోసుకుందామా" అని అన్నీ తెలుగులోనే చెప్తోంది. చూస్తుంటే ఇది నిజమేనా అన్న భ్రమ కలుగుతోంది తరంగిణికి. వెండి గిన్నెలో పెరుగన్నం కలిపి వాడికి గోరు ముద్దలు పెడుతూ " చందమామ రావే, జాబిల్లి రావే" అంటూ శ్రావ్యంగా పాడుతూ కొసరి కొసరి తినిపించడాన్ని కేవలం తరంగిణే కాక, ప్రభాకర్ కూడా వింతగా చూశాడు.

" చిన్నప్పటినించీ అన్నీ నేర్పిస్తేనే బాగా తెలుస్తాయి కదా పెద్దమ్మా, అందుకే వీడికి ఇప్పటినించే చిన్నప్పుడు నువ్వు మాకు చెప్పిన కథలన్నీ తెలుగులో చెప్తున్నాను, ఆన్ లైన్ లో కూడా చాలా ఉన్నాయి తెలుసా?" అంటున్న శ్రీనిజ ని వింతగా చూసింది.

" అప్పా ఎంగే కణ్ణా? ఉంగ పేరు ఎన్న? సొల్లు." అంటూ కొడుకుతో కబుర్లు చెప్తాడు శ్రీవత్సన్.

"వాళ్ళిద్దరినీ చూశావా అక్కా? కొడుకుతో మన పిల్లేమో తెలుగులో కబుర్లు చెప్తూ ఉంటే ఆ అబ్బాయేమో తమిళంలో మాట్లాడతాడు, ఇలా అయితే మన మనవడికి పుట్టుకతోనే రెండు భాషలూ వచ్చేస్తాయి కదూ" అంది సౌదామిని సంబరంగా.

" అవును నిజమే సౌదా, మనం ఇన్నేళ్ళుగా పోరినా పిసరంత ఖాతరు చెయ్యకుండా, ఇప్పుడు శ్రీనిజ తన పిల్లాడితో తెలుగులో మాత్రమే మాట్లాడడానికి కారణం కూడా తెలిసిపోయింది కదూ "అంది.

"అంటే?," అర్థం కానట్టు అడిగింది సౌదామిని.

" ఏమీ లేదులే, ఊరికే అన్నాను" అంది నవ్వుతూ.

" ఏదైనా కళ్ళముందు సులభంగా కనిపిస్తూ ఉంటే దాని విలువ తెలీదు, ప్రభాకర్ చెప్పినట్టు పదే పదే చెప్తూ ఉంటే పోరినట్టు ఉంటుంది. ఒక్కసారి తన భాష వినిపించిన చోట ఉండడమూ, తన భర్త ఎప్పుడూ కొడుకుతో తన మాతృభాషలోనూ మాట్లాడడమూ శ్రీనిజ కి తనకి తెలియకుండానే ఏవో కొత్త విషయాలు తెలిపాయి. దాని ప్రభావమే ఇది, మనిషిలో అనాదిగా ఉన్న పోటీ తత్వం కూడా దీనికి కారణం కావచ్చునేమో, తన బిడ్డకి భర్త అతని భాష నేర్పిస్తూ ఉంటే తను మాత్రం ఎందుకు వెనకబడాలి? అన్న భావన ఆమెని తన భాష వైపు మొగ్గెలా చేసింది. లేకపోతే శ్రీనిజ ఒక్కసారిగా ఇంత బాగా తెలుగులో మాట్లాడడమా? "

ఇవన్నీ ఇప్పుడు బయటకి చెప్తే "నువ్వన్నింటినీ ఎక్కువగా విశ్లేషిస్తావు," అని తననే ఆట పట్టిస్తారు అందరూ. కారణమేదైతేనేం, ఇప్పుడు తాను మాతృ భాష మాట్లాడడమే కాక, పిల్లాడికి కూడా నేర్పిస్తోంది అంతే చాలు.

" మాతృ భాష బ్రతకాలంటే ఇలా వివిధ రాష్ట్రాల మధ్యన పెళ్ళిళ్ళు జరగడం కూడా ఒక మార్గమేమో" అప్పుడైనా కనీసం తెలుగు సినిమాలవల్లే తెలుగు బ్రతుకుతోంది అని చెప్పుకోనక్కరలేదు, ఇలాగైనా అమ్మ భాష ఊపిరి తీసుకుంటోంది, ఈ అమ్మ బాధ తీరే మార్గమూ కనిపిస్తోంది" అనుకుంది తరంగిణి.

పెద్దమ్మ మనసులోని భావాలు తెలియని పసివాడు మాత్రం బోసినవ్వులు చిందిస్తున్నాడు.

●●●

Click here to share your comments on this story